# బీఆర్ఎస్‌తోనే ఇల్లెందుకు గుర్తింపు



హరిప్రయా నాయక్‌కు బతుకమ్మలు, కోలాటాలతో స్వాగతం పలుకుతున్న పట్టణ ప్రజలు

- రూ.315.10 కోట్లతో పట్టణ అభివృద్ధి
- మిషన్ భగీరథ పథకంతో తీరనున్న తాగునీటి సమస్య
- మ్యానిఫెస్టోలో లేని అనేక పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేశారు
- కరోనా కష్టకాలంలో అండగా ఉన్నా..
- ఆడబిడ్డగా ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా
- బీఆర్ఎస్ ఇల్లెందు అభ్యర్థి, ఎమ్మెల్యే హరిప్రియా నాయక్

ఇల్లెందు, నవంబర్ 7: స్వరాష్ట్రంలో ఉద్యమ నాయకుడు కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాతనే ఇల్లెందు నియోజకవర్గానికి గుర్తింపు వచ్చిందని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియా నాయక్ అన్నారు. పట్టణంలోని 17, 18, 19, 20, 21 వార్డుల్లో మంగళవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పూలమాలలతో ఎమ్మెల్యేకు బ్రహ్మరథం పట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 2018లో ఎమ్మెల్యేగా గెలిచి హైదరాబాద్ వెళ్లిన సందర్భంలో తాను ఇల్లెందు ఎమ్మెల్యేనంటే ఇల్లెందు ఎక్కడ అన్న పరిస్థితి ఉండేదని, సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. ఇల్లెందు నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1,814.40కోట్లు, సంక్షేమ పథకాలకు రూ.1187. 79కోట్లు కలిపి రూ.3002.19 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఒక్క ఇల్లెందు పట్టణానికి రూ.315.10కోట్లు ఖర్చు చేసి అన్ని విధాలుగా అభివృద్ధిలోకి తీసుకొచ్చామని వివరించారు. పాలకవర్గం సమష్టి పనితీరుకు నిదర్శనంగా రెండు సార్లు ఇల్లెందు మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. దేశంలో 5వేల పైచిలుకు జనాబా ఉన్న మున్సిపాలిటీల్లో ఇల్లెందుకు 18వ స్థానం వచ్చిందని వెల్లడించారు. మిషన్ భగీరథ పథకంతో పట్టణంలో తాగునీటి కష్టాలను తీర్చేందుకు రూ.30కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. పనులు కొనసాగుతున్నాయని, పూర్తయితే 100 ఏండ్లయినా నీటి కష్టాలుండవన్నారు. 60 ఏండ్ల కలైన బస్‌డిపోను సాధించుకొని ప్రారంభించుకున్నామని సంతోషం వ్యక్తం చేశారు. పట్టణంలో వెజ్, నాన్‌వెజ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లు, స్కిల్ డెవలప్‌మెంట్, మల్టీ యుటిలిటీ సెంటర్లు, డిజటల్ లైబ్రరీ, అంబేద్కర్, బంజారా భవన్‌ను నిర్మించామన్నారు. బుగ్గవాగు ప్రక్షాళన, సెంట్రల్ లైటింగ్, 20 ఏండ్లుగా నోచుకోని ఇల్లెందు ప్రధాన రహదారి పనులు తదితర అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ఇల్లెందుకు వెలుగులు పంచామన్నారు. మానవ వ్యర్థాలతో ఎరువులను తయారు చేసేందుకు ఎఫ్ఎస్‌టీపీని నిర్మించుకున్నామని, ముస్లింల కోసం షాదీఖాన స్థలం కేటాయించామని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రత్యేకంగా విడుదల చేసిన రూ.25కోట్లతో ప్రతి వార్డులోని సమస్యల పరిష్కారానికి 367 పనులు గుర్తించి మంజూరు ఇచ్చామని పేర్కొన్నారు. 300 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తున్నామని, ఇంటి స్థలం ఉన్న వారికోసం గృహలక్ష్మి పథకం ద్వారా 500 ఇళ్లు మంజూరు అయ్యాయన్నారు. రైల్వేస్టేషన్ నిర్మాణంతో ఏ ఒక్క ఇంటికి కూడా నష్టం జరగకుండా బైపాస్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. ఇల్లెందు పట్టణంలోని సమస్యలను పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారం మరువలేనిదని వివరించారు. రైతు బీమా తరహాలోనే భూమిలేని తెల్లరేషన్ కార్డు కలిగిన పేదల కోసం కుటుంబంలో ఎవరైనా చనిపోతే కేసీఆర్ బీమాతో రూ.5లక్షలు, రేషన్ షాపుల్లో సన్న బియ్యం, సౌభాగ్యలక్ష్మి కింద మహిళలకు రూ.3వేల జీవన భృతి, రూ.400కే గ్యాస్ సిలిండర్ వంటి అనేక పథకాలను మ్యానిఫెస్టోలో పెట్టుకున్నామని తెలిపారు. విద్యార్థుల కోసం రూ.11.50 కోట్లతో ప్రభుత్వ ఐటీఐ, రూ.37.50 కోట్లతో 100 పడకల ప్రభుత్వ దవాఖానను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



వృద్ధుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న హరిప్రియ

కరోనా కష్టకాలంలో రెండేళ్లు మీతో నడిచి అండగా ఉన్నానని గుర్తు చేశారు. 2014కు ముందు ఇల్లెందు ఎట్లుండే.. ఇప్పుడు ఎట్లుందో మీ కళ్లముందే ఉందని, దేశంలో 24గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అని కొనియాడారు. 2014, 2018 ఎన్నికల సమయంలో మ్యానిఫెస్టోలో పెట్టని అనేక పథకాలను అమలు చేసిన ప్రభుత్వం బీఆర్ఎస్ ఒక్కటేనని పేర్కొన్నారు. అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్‌ను నమ్ముదామా.. పూటకో మాయ మాటలు చెబుతున్న ప్రతిపక్షాలను నమ్మాలో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. అధికారం కోసం మాత్రమే ఎన్నికల సమయంలో వస్తున్న పార్టీలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నియోజకవర్గానికి కోట్ల రూపాయలు వెచ్చించిన కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడానికి అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. మీ ఇంటి ఆడబిడ్డగా ఈ ప్రాంత అభివృద్ధి కోసం పనిచేసిన తనను ఆశీర్వదించి, నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రచారంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ జానీపాషా, కౌన్సిలర్లు జేకే శ్రీను, స్వాతి, లక్ష్మి, సరిత, పద్మ, కొడకంచి పద్మ, నవీన్, ఆజాం, రవి, బీఆర్ఎస్ నాయకులు నాదెండ్ల శ్రీనివాసరావు, ఎస్ రంగనాథ్, పరుచూరి వెంకటేశ్వర్లు, వీర్ల శ్రీను, మురళి, గిన్నారపు రాజేశ్ పాల్గొన్నారు.

## ఇల్లెందులో ఏడు నామినేషన్లు దాఖలు



నామినేషన్ పత్రాన్ని ఆర్‌వో కాశయ్యకు అందిస్తున్న హరిసింగ్

ఇల్లెందు, నవంబర్ 7: ఇల్లెందు నియోజకవర్గంలో మంగళవారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి జే కాశయ్య తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ నామినేషన్ పత్రాలను ఏఎంసీ చైర్మన్ బానోత్ హరిసింగ్ నాయక్ మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి జే కాశయ్యకు అందజేశారు. వీరితో పాటు రవీందర్ నాయక్ (బీజేపీ), కోరం కనకయ్య(కాంగ్రెస్), లకావత్ ప్రసాద్ (విద్యార్థి రాజకీయ పార్టీ), ఏ నామోదర్‌నాయక్ (స్వతంత్ర), ఏ నామోదర్‌నాయక్(కాంగ్రెస్), డాక్టర్ జీ రవి(కాంగ్రెస్)లు తమ నామినేషన్లు సమర్పించారు. ఇల్లెందు నియోజకవర్గంలో ఇప్పటి వరకు మొత్తం 12 నామినేషన్‌లు దాఖలు కాగా కోరం కనకయ్య, నామోదర్‌నాయక్‌లు రెండు సెట్లు వేశారు. ఆయనతోపాటు జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, బానోత్ వీరభద్రం, మాధవి ఉన్నారు.

## భద్రాచలంలో రెండు నామినేషన్లు..

భద్రాచలం, నవంబర్ 7 : భద్రాచలంలో మంగళవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. భద్రాచలం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మంగీలాల్‌కు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న మర్మం తిరుపతమ్మ, ధర్మసమాజ్ పార్టీ తరపున పోటీ చేస్తున్న రవ్వా భద్రమ్మ నామినేషన్లను సమర్పించారు. ఈ నెల 10వరకు నామినేషన్లు సమర్పించేందుకు గడువు ఉంది. మరో రెండు రోజుల్లో మరికొన్ని నామినేషన్లు రానున్నట్లు ఆర్డీవో కార్యాలయ అధికారులు తెలిపారు.

## 108 వాహనంలో ప్రసవం



తల్లి, బిడ్డతో 108 సిబ్బంది

టేకులపల్లి, నవంబర్ 7: మారుమూల ప్రాంతమైన దారపాడు గ్రామానికి చెందిన గర్భిణీ 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో నొప్పులు ఎక్కువ రావటంతో సిబ్బంది సుఖ ప్రసవం చేశారు. మంగళవారం మండలంలోని కొప్పురాయి గ్రామ పంచాయతీ దారపాడు గ్రామానికి చెందిన పూన్నెం శైలజ ఉదయం పురిటీ నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. 108 సిబ్బంది దారపాడు వెళ్లి గర్భిణీని తీసుకొని సులానగర్ పీహెచ్‌సీకి వెళ్లారు. కానీ కడుపులో బిడ్డ పేగు మెడలో వేసుకోవడంతో వైద్య సిబ్బంది సూచనల మేరకు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో కొత్తగూడెం సమీపాన నొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది అశోక్ ఫోన్ ద్వారా డాక్టర్ల సూచనల మేరకు సుఖ ప్రసవం చేశారు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. వారిని రామవరం మాతశిశు సంక్షేమ ఆస్పత్రికి తరలించారు. 108 సిబ్బంది అశోక్, రామారావును గర్భిణీ భర్త సురేశ్, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## అమరుల బాటలో పయనిద్దాం

టేకులపల్లి, నవంబర్ 7: అమరుల ఆశయ బాటలో పయనిద్దామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఏ సాంబ అన్నారు. మంగళవారం టేకులపల్లిలో విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కోశాధికారి జే గణేశ్ అధ్యక్షతన జరిగిన సభలో సాంబ మాట్లాడారు. విద్య లక్ష్యంగా సమ సమాజ స్థాపనకై తమ వంతు కృషిగా పోరాటాలను నిర్వహించిన జార్జిరెడ్డి, జంపాల ప్రసాద్‌తో పాటు వారి స్ఫూర్తితో ఎంతో మంది విద్యార్థులు ఉద్యమంలో పాల్గొని అమరులయ్యారన్నారు. కార్యక్రమంలో నాయకులు నవ్య, కావ్య, పండు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## త్రివేణిలో జాతీయ సైన్స్ డే



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబర్ 7 : లక్ష్మీదేవిపల్లిలోని త్రివేణి పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. నోబెల్ గ్రహీత, భారతరత్న, భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గొల్లపూడి జగదీశ్, సీఆర్‌వో కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్‌సింగ్, వైవీ సురేశ్, వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య పాల్గొన్నారు.

## కరాటేలో జిల్లా క్రీడాకారులకు పతకాలు




పతకాలు సాధించిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న హీరో సుమన్

కొత్తగూడెం టౌన్, నవంబర్ 7 : ఖమ్మంలో ఈ నెల 5వ తేదీన జరిగిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు పతకాలు సాధించారు. కటాస్ విభాగంలో వివిధ కేటగిరిల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఎంఏ సనా(బంగారు పతకం), ఎంఏ అయాన్(బంగారు పతకం), కే.లికిత్(బంగారు పతకం), సీహెచ్ విజయ్(బంగారు పతకం), ఎల్. హర్షిత్(వెండి పతకం), సీహెచ్ అజయ్(వెండి పతకం) సాధించి చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. సినీ హీరో, సీనియర్ కరాటే మాస్టర్ సుమన్ చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు. కోచ్ పెద్దపాటి నిహారిక, క్రీడాకారులను జిల్లా కుంగ్‌ఫూ, కరాటే అకాడమీ చైర్మన్ కాశీహుస్సేన్, ఆదినారాయణ, ఇనిగాల మొగిలి, మాస్టర్లు అభినందించారు.

## జేవీవీ ఆధ్వర్యంలో ప్రశ్నపత్రాలు విడుదల



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబర్ 7 : జన విజ్ఞాన వేదిక తెలంగాణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రగతికి తొలిమెట్లు ప్రశ్న వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ కుమారస్వామి, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ శారద, చుంచుపల్లి హైస్కూల్ హెచ్‌ఎం వసంతలక్ష్మి చేతుల మీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు, కస్తూరి, వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, సుబ్బారావు పాల్గొన్నారు.

## విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

జూలూరుపాడు, నవంబర్ 7 : మండలంలోని జూలురుపాడు కాంప్లెక్స్ పరిధి కోయకాలనీ, జూలూరుపాడు, వినోభానగర్, అనంతారం, గాంధీనగర్, వెంగన్నపాలెం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలను కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ లక్ష్మీనరసయ్య మంగళవారం పరిశీలించారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా బోధించిన సిలబస్ నుంచి విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. ఉపాధ్యాయులు ఇంకా విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరచాలని సూచించారు. ఆయనవెంట ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.

## 10 లీటర్ల సారా స్వాధీనం

పర్ణశాల, నవంబర్ 7 : మండలంలోని దబ్బనూతల గ్రామశివారులో పోలీసులు 10లీటర్ల నాటుసారాను మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ కృష్ణయ్య సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై వస్తున్న వ్యక్తి వద్ద 10లీటర్ల సారాను గుర్తించారు. అతడిని విచారించగా తాటివారిగూడేనికి చెందిన తుర్రం చిన్నాబ్బి అని, చుట్టుపక్కల గ్రామాల్లో సారా విక్రయిస్తున్నానని పేర్కొన్నాడు. బైక్‌ను స్వాధీనం చేసుకొని చిన్నాబ్బిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కేశవరావు తెలిపారు.